సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పేదలకు చీరల పంపిణీ



మహిళకు చీర అందిస్తున్న గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి

గాజువాక : సినీ నటుడు ఐనవోలు ప్రసన్నకుమార్ పేదలకు బుధవారం చీరలు, దుస్తులను పంపిణీ చేశారు. తన మాతృమూర్తి సరోజిని సంస్మరణ దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇ.నరేష్, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, సౌత్ ఏసీపీ త్రినాథ్ తదితరుల చేతులమీదుగా దుస్తులను అందజేశారు. సుమారు వెయ్యి మంది పేదలకు చీరలు, దుస్తులను అందజేసినట్టు ప్రసన్నకుమార్ తెలిపారు. కార్యక్రమంలో 72వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరట్ల శ్రీనివాస్, సినీ నటుడు, దర్శకుడు రవి బోనెల, బాడీ బిల్డర్ షేక్, పల్సర్ బైక్ ఝాన్సీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల విజయం తథ్యం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: దేశంలో సరికొత్త చరిత్రకు విశాఖ ఉక్కు ఉద్యమం నాంది పలకనుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికుల సత్తా చాటుతూ, మరోసారి కార్మిక వర్గం తప్పక విజయం సాధిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1084వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్ఎంఎస్-2 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిఘా

- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం: నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గల రౌడీషీటర్లపై నిఘా పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ట్రాఫిక్, క్రైం, శాంతి భద్రతలు, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ రవాణాకు అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నా రు. నగరంలో రాత్రిపూట నిఘా మరింత పటి ష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112కు వచ్చే ఫిర్యా దులను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, లీగల్ అడ్వయిజర్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, రూరల్ తహసీల్దార్ రమణయ్యతో కలసి ఆయన గోడౌన్‌కు వేసిన సీల్, లోపల ఉన్న వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి.. సిబ్బంది విధులపై ఆరా తీశారు. భద్రత ప్రమాణాలు పాటించాలని వారిని ఆదేశించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధి ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	పంపిణీ చేసిన నగదు
2019-20	25640	17,90,93,026
2020-21	27343	18,81,09,535
2021-22	28563	19,83,21,255
2022-23	29992	19,94,32,592
2023-24	31534	20,96,86,250
ఐదు విడతల్లో అందజేసిన నగదు		97,46,42,658

వేకువనే వెలుగు రేఖలు

పింఛన్‌దారుల్లో ఆనందోత్సాహాలు

నాడు

గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల ప్రక్రియ ఒక ప్రహసనంగా ఉండేది. పింఛన్ వస్తుందో, రాదో.. వచ్చినా ఏ సమయానికి ఇస్తారో.. అనే ఆందోళనతో గంటలు, రోజుల తరబడి నిరీక్షణతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బంది పడేవారు. వారి స్థితి దయనీయంగా ఉండేది.



గతంలో పెన్షన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు (ఫైల్)

నేడు

పింఛన్‌దారుల ఇళ్లల్లో వేకువనే వెలుగురేఖలు ప్రసరిస్తున్నాయి. పింఛన్ల పంపిణీ ఒక పండగలా సాగుతోంది. గత ప్రభుత్వంలో మాదిరిగా నిరీక్షణ లేదు. టెన్షన్ అసలే లేదు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారే పింఛన్ ఇంటికి వచ్చేస్తోంది. దీంతో వారి మోముపై దరహాసం, కళ్లల్లో కాంతులు వెల్లివిరుస్తున్నాయి.



ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

గాజువాక : వైఎస్సార్ పెన్షన్ కానుకతో లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నిండాయి. ప్రతీ నెలా ఠంఛన్‌గా ఒకటో తేదీనే పింఛన్లు చేతికి రావడంతో నిశ్చింతగా, దర్జాగా బతుకుతున్నామని చెబుతున్నారు. తమకు ఆర్థికపరమైన భరోసా దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు

భారీగా పెరిగిన పింఛన్లు

జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత సంక్షేమ పథకాల లబ్ధిదారులు కూడా భారీగా పెరిగారు. అందులో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక (పింఛన్) లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. గత ప్రభుత్వ హయాంలో 22,891 మంది ఉన్న పింఛన్‌దారుల సంఖ్య ఈ ప్రభుత్వ హయాంలో 31,534కు పెరిగింది. గడిచిన ఐదేళ్లలోను 8,643 మంది లబ్ధిదారులు అదనంగా పెరిగారు. గతంలో రూ.2 వేలు మాత్రమే ఉన్న పింఛన్‌ను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూ.3వేలకు పెంచారు. ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గాజువాక నియోజకవర్గంలో కేవలం పింఛన్లకే రూ.97.46 కోట్లను లబ్ధిదారులకు అందజేసింది.



64వ వార్డు యాతపాలెంలో వృద్ధురాలికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ లలిత

పింఛన్‌దారులను వెదుక్కుంటూ వెళ్లి..

పింఛన్ తీసుకొనే వృద్ధులు, దివ్యాంగులు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో ఉన్నా వలంటీర్లు అక్కడికి వెళ్లి పింఛన్‌ను అందజేస్తున్నారు. ఆస్పత్రి ఎంత దూరంలో ఉన్నా వెదుక్కుని వెళ్లి పింఛన్ సొమ్మును అందించి వస్తున్నారు. పింఛన్‌ను సకాలంలో అందజేయడం తమ బాధ్యతగా జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం భావించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రుణపడి ఉంటాను



నా భర్త చనిపోయిన తర్వాత ఆర్థికంగా చాలా ఇబ్బంది పడేదాన్ని. ఆ కష్ట సమయంలో వలంటీర్ స్వయంగా ఇంటికి వచ్చి పింఛన్ రాశారు. రూ.3వేలు పెన్షన్ వస్తోంది. ఈ డబ్బు నా అవసరాలకు సరిపోతోంది. వృద్ధాప్యంలో ఉన్న నాకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకయ్యాడు. జగన్‌బాబుకు రుణపడి ఉంటాను. ఎప్పటికీ జగన్‌బాబే మా ముఖ్యమంత్రి.

– పాముల లక్ష్మి, పెదగంట్యాడ

పింఛన్ ఆదుకుంటోంది



నాకు కొడుకు, కూతురు సంతానం. వారికి వివాహాలు చేశాం. బతుకు తెరువు కోసం వారు ఎక్కడో పనులు చేసుకుంటున్నారు. ప్రస్తుతం నాకు, నా భార్యకు ఎలాంటి ఆర్థిక భరోసా గాని, ఆసరా గాని లేదు. గతంలో కూలి పనులు చేసేవాడిని. ఇప్పుడు వృద్ధాప్యం వల్ల పనులు కూడా చేయలేను. ప్రభుత్వం ఇస్తున్న పింఛనే మాకు దిక్కు. ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ వచ్చి పెన్షన్ ఇస్తున్నారు. ఆ డబ్బులతోనే బతుకుతున్నాం. జనవరి నెల నుంచి పెన్షన్ రూ.3వేలు చేశారు. చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నెల్లి అప్పారావు, అగనంపూడి

గతంలో క్యూల్లో పడిగాపులే..



గతంలో పింఛన్ తీసుకోవడానికి క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సి వచ్చేది. ఏ సమయానికి ఇస్తారో, ఏ రోజు ఇస్తారో తెలిసేది కాదు. పెన్షన్ ఇస్తారని తెలిసినప్పుడు ఉదయానే వెళ్లి గంటల తరబడి అక్కడే ఉండాల్సి వచ్చేది. జగన్ మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత పెన్షన్ ఇంటికే వస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి డబ్బులు ఇస్తున్నారు. పెన్షన్ రూ.3 వేలకు పెరగడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి పేదల ఇబ్బందులను తెలుసుకుని నిస్వార్థంగా అందిస్తున్న సేవలకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఎం.ఈశ్వరమ్మ, రాజీవ్‌నగర్

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కూర్మన్నపాలెం: కాపుజగ్గరాజుపేట విద్యుత్ సబ్ స్టేషన్ 33/11 కేవీ వీఎస్ఈజెడ్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా విజ్ఞాన్ కాలేజీ, కాపుజగ్గరాజుపేట, ఎస్‌టీబీఎల్, డాక్‌యార్డ్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయ 24వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సదరంపట్టు నుండి మహిళలు సారెతో భారీ ఊరేగింపు చేసి, అమ్మవారికి సమర్పించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు (చందు) పాల్గొని, అమ్మవారికి విశేష పూజలు చేశారు. వెంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన చేశారు. కరణం సన్యాసిరావు, రాజు దంపతులు అమ్మవారికి రూ.50వేల విలువ గల వెండి ఆభరణాలను బహూకరించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం, సాము గరిడీలు అలరించాయి. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, ఎస్ఐ మహాలక్ష్మి, నాయకులు బలిరెడ్డి శ్రీనివాసరావు, సత్యనారాయణ, పిల్లా కొండలరావు, సాయిన సన్యాసిరావు, దాసరి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

రూ.6.8 కోట్లతో రహదారుల నిర్మాణం



బీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

- శంకుస్థాపన చేసిన మేయర్ హరి వెంకటకుమారి

పెదగంట్యాడ: జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ జోన్-6 పరిధిలోని గాజువాక ప్రాంతంలో రూ.6.80కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి, ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని అన్ని వార్డుల్లో వసతులు కల్పిస్తున్నామన్నారు. 73వ వార్డులో వంటిల్లు జంక్షన్ నుంచి బీటీ రోడ్డు, కాంక్రీట్ మిక్స్ కాలువ నిర్మాణ పనులకు 4 కోట్ల 80లక్షల ఎనిమిది వేల రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. అలాగే 64, 65, 66, 74,75 వార్డులను అనుసంధానం చేసే బాలచెరువు రోడ్డు (బీసీ రోడ్డు) కాకతీయ ఐటీఐ కూడలి నుంచి గంగవరం పోర్టు వంతెన వరకు బీటీ రోడ్డును 1 కోటి 99 లక్షల 92 వేల రూపాయలతో నిర్మించనున్నట్లు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. సీఎ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు.

కోట్ల రూపాయలతో అభివృద్ధి : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశామన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ పి.సింహాచలం, జీవీఎంసీ ఈఈ ప్రసాద్‌బాబు, నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, మొల్లి చిన్న, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ధర్మాల శ్రీను, నాగిశెట్టి శ్రీను, గొందేశి వెంకటరమణారెడ్డి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. అమ్మవారి సారె ఉత్సవం

- ఘనంగా మాతా దుర్గాభవాని ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక సూది కొండపై వేంచేసిన మాతా దుర్గా భవాని అమ్మవారి ఆలయ 4వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు వందలాది రకాల ఫలాలు, మిఠాయిలతో సారెను భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఊరేగింపులో కోలాటం, సాముగరిడీలు, చిడతల భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం విశేష అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ గురు మాత కరణం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ), బళ్ల పైడిరాజు, తాటికొండ వెంకటరావు, జగ్గారావు, కోసూరు నాయుడు, ఎం.అర్జున్, అచ్చన్నాయుడు, కొమ్మోజు బ్రహ్మాజీ పాల్గొన్నారు.



పూజలందుకున్న మాతా దుర్గాభవాని



దుర్గా భవాని అమ్మవారికి సమర్పించేందుకు సారెను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న మహిళలు

దాడి కేసులో ఏడేళ్ల జైలు

అక్కిరెడ్డిపాలెం: యువకునిపై దాడి చేసిన వ్యక్తికి గాజువాక కోర్టు 7 ఏళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించింది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 28వ తేదీన గాజువాక గాయత్రి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద షేక్ అబ్దుల్లా, అతని స్నేహితుడిని చంపేస్తానని బెదిరించడంతోపాటు బీర్ బాటిల్‌తో కుడి చేతి మీద, గెడ్డం మీద పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి.బి.ఎస్.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ వేయగా గాజువాక మేజిస్ట్రేట్ జి.షణ్ముఖరావు విచారణ అనంతరం పై విధంగా తీర్పు ఇచ్చారు.

ప్రీమియర్ లీగ్‌లో స్టీల్ టైటాన్స్ విజయం

ఉక్కునగరం: ఉక్కు ఎంప్లాయిస్ ప్రీమియం లీగ్ టోర్నమెంట్‌లో స్టీల్ టైటాన్స్ జట్టు గెలుపొందింది. స్థానిక ఉక్కు స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో స్టీల్ వారియర్స్, స్టీల్ టైటాన్స్, స్టీల్ ఎవెంజర్స్, ఉక్కు రాయల్స్, ఉక్కు సూపర్ గ్రీన్ జట్లు పాల్గొంటున్నాయి. 11 రోజుల పాటు జరగనున్న టీ 20 క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్టీల్ టైటాన్స్, ఉక్కు రాయల్స్ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో స్టీల్ టైటాన్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. టైటాన్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉక్కు రాయల్స్ జట్టు 19 ఓవర్లకు 107 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. టైటాన్స్ జట్టుకు చెందిన బౌలర్ మొల్లి అప్పలరాజు 3 ఓవర్లలో 9 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసుకుని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉక్కు అధికారులు పాల్గొన్నారు.



గెలుపొందిన టైటాన్స్ జట్టు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 85, 87 వార్డుల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



87వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉరుకూటి చందు

కూర్మన్నపాలెం: ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించి, పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేశారన్నారు. 87వ వార్డు ఎరుకుల వీధి సచివాలయ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు ప్రారంభించారు.

288 మందికి వైద్య సేవలు : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్ శివయ్య, డాక్టర్ స్వరూపరాణిలతో పాటు మరో నలుగురు వైద్యులు సేవలు అందించారు. రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు షుగర్, బీపీ, ఆర్థో, గైనిక్, కంటి పరీక్షలు నిర్వహించారు. ఆవసరమైన వారికి నెలకు సరిపడా మందులను అందజేశారు. సుమారు 288 మంది వైద్య సేవలను పొందినట్లు అధికారులు తెలిపారు. జెడ్సీ పి. సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.



శిబిరంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న ప్రజలు

85వ వార్డులో 388మందికి వైద్యసేవలు

అగనంపూడి: నిరుపేదల ముంగిటకు వైద్య సేవలు చేర్చడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉరుకూటి చందు అన్నారు. 85వ వార్డుకు సంబంధించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లంకెలపాలెం యూపీహెచ్‌సీలో బుధవారం నిర్వహించారు. 388 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్సీ పొందూరు సింహాచలం, ఏఎంహెచ్‌వో కిరణ్ కుమార్, వైఎస్సార్ సీపీ గాజువాక మండల కో-ఆర్డినేటర్ బొడ్డ గోవింద్, వైద్యులు డాక్టర్ చైతన్య, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ పుష్ప, హెల్త్ సూపర్‌వైజర్ కరుణ, ఫార్మసిస్ట్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



85వ వార్డులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



85వ వార్డులోని జగనన్న సురక్ష శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

సేవలు బాగున్నాయి



సురక్ష శిబిరంలో వైద్య సేవలు చాలా బాగున్నాయి. నాకు బీపీ, షుగర్ ఉన్నాయి. గతంలో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లే స్తోమత లేక చాలా ఇబ్బంది పడేదాన్ని. ఇప్పుడు ఇక్కడ శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షించి, మందులు అందిస్తున్నారు. నా ఆరోగ్యం కుదుటపడింది. సీఎం జగన్ మా ఇంటి వద్దకే వైద్యులను పంపించి ఉచితంగా సేవలు అందించడం చాలా బాగుంది.

– రాముడమ్మ, కణితి కాలనీ

పైసా ఖర్చు లేకుండా వైద్యం



గతంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎక్కడికి వెళ్లా లో తెలియక అవస్థలు పడ్డాను. ఇప్పుడు మెరుగైన వైద్య సేవలు పొందాను. పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం,మందులు కూడా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు.

– పల్లా త్రినాధమ్మ, కూర్మన్నపాలెం

దళితవాడ పంచాయతీలతోనే సమగ్రాభివృద్ధి

ఫైర్ సర్వీసెస్ డీజీపీ సునీల్‌కుమార్



జగ్జీవన్‌రామ్‌ను సత్కరిస్తున్న డీజీపీ సునీల్‌కుమార్

ఉక్కునగరం: దళితవాడ పంచాయతీలతోనే దళితుల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీసెస్ డీజీపీ పి.వి.సునీల్‌కుమార్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకుడు బూలా జగ్జీవన్ రామ్ ఆత్మీయ అభినందన సభలో ఆయన ప్రసంగించారు. సబ్ ప్లాన్ నిధుల్లో మూడో వంతు దళిత వాడల అభివృద్ధికి కేటాయించినట్లయితే, ఆ నిధులతో దళితవాడల్లో రోడ్లు, తాగునీరు, స్కూల్, ఆస్పత్రి, యూజీడీ సిస్టం, కమ్యూనిటీ హాల్ వంటి అనేక సదుపాయాలు కల్పించవచ్చన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా 1500 మహిళలను సర్పంచ్‌లను చేయవచ్చని, తద్వారా అంబేడ్కర్ కలలుగన్న రాజ్యాధికారం దిశగా అడుగులు వేయగలమన్నారు. సమావేశంలో స్టీల్‌ప్లాంట్ అధికారులు, వివిధ కార్మిక సంఘాలు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.